# దక్షిణ భారతాన విచిత్ర "జనాభా సంక్షోభం" రానుందా !

ఒక నాడు అధిక జనాభా ఓ ప్రధాన సమస్యగా భావించబడింది. "ఒక్కరు లేదా ఇద్దరు", "ఒక్కరు లేదా అసలే వద్దు(వన్ ఆర్ నన్)" అంటూ ప్రభుత్వ జనాభా నియంత్రణ నినాదాలు మిన్నంటేవి. నాడు సంతానోత్పత్తి అధికంగా నమోదు అయ్యేది. నాడు ఒకే జంట అరడజనుకు పైగా పిల్లల్ని కనేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు తగ్గుతూ జనాభా పెరుగుదల రేటు పడిపోతున్నది. భారత్‌లో కూడా సంతానోత్పత్తి రేటు కొంత తగ్గింది. డిజిటల్ యువతలో పెళ్లి లేదా సంతానం వద్దనుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పిల్లల్ని కనడం, సపర్యలు చేయడం, చదివించడం లాంటివి అతి పెద్ద ప్రతిబంధకాలుగా భావించబడుతున్నాయి. ఉత్తర భారతంతో పోల్చి చూస్తే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల రేటు బాగా తగ్గడం, కుటుంబ నియంత్రణ ఇంటింటి నినాదం కావడం, ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలకు పరిమితం కావడంతో సంతానోత్పత్తి రేటు గణనీయంగా పడిపోతున్నది.

విచిత్ర "జనాభా సంక్షోభం"లో దక్షిణ భారతం:

దక్షిణ భారతాన ప్రత్యేక జనాభా సంక్షోభంతో ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలు ఉత్పన్న కానున్నాయి. ఈ విచిత్ర సంక్షోభంతో దక్షిణాది రాష్ట్రాలకు "డిలిమిటేషన్" కారణంగా పౌర జనాభా తగ్గడం, రాజకీయంగా ఈ రాష్ట్రాలకు ప్రాధాన్యం తగ్గడం, అధిక జనాభా నమోదు అవుతున్న ఉత్తరాది రాష్ట్రాలకు ప్రభుత్వ నిధులు, అధిక ఎంపీ/ఎంఎల్ఏ సీట్లు పెరగడం జరుగబోతున్నది. ఈ విషయాలను గమనిస్తూ నారా చంద్రబాబు నాయుడు, ఎం కె స్టాలిన్‌లు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లల్ని కనాలంటూ ప్రకటనలు చేసే స్థాయికి చేరడం గమనించాలి. దక్షిణ భారతంలో ఆర్థికంగా, సామాజికంగా మెరుగైన పరిస్థితుల్లో ఉన్నారు. ఇక్కడ బాలికలు/మహిళల్లో విద్య పెరగడం, గర్భనిరోధక మార్గాలు పెరగడం, లింగ సమానత్వం, సంతానోత్పత్తిలో యువతులకు స్వేచ్ఛ పెరగడంతో జనాభా పెరుగుదల పడిపోవడం ఫలితంగా ఈ రాష్ట్రాలకు కొన్ని కొత్త చిక్కులు రానున్నాయి. ఈ సమస్యకు స్పందిస్తూ నేటి రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలు, మీడియా కామెంటేటర్లు మరో వినూత్న "జనాభా సంక్షోభం లేదా డెమోగ్రఫిక్ క్రైసిస్" రానుందని విశ్లేషిస్తున్నారు. రానున్న జనాభా సంక్షోభంతో ఆర్థికాభివృద్ధి, వృద్ధులపై వైద్య ఆరోగ్య ఖర్చులు పెరగడం లాంటి ప్రమాదకర పరిణామాలు రావచ్చని హెచ్చరిస్తున్నారు.

రెండు లేదా అంత కన్న ఎక్కువ పిల్లల్ని కనాలా !

ఇప్పటికే భూగోళ పర్యావరణ ఆరోగ్యంపై దెబ్బ మీద దెబ్బ పడుతున్నాయి. వాతావరణ ప్రతికూల మార్పులు, జీవవైవిధ్య సమస్య, అంతరించిపోతున్న జీవజాతులు, సహజ వనరుల కొరత, పోషకాహార అభద్రత, పేదరికం లాంటి తీవ్ర సమస్యలు భూగ్రహాన్ని, సమస్త జీవకోటి మునుగడను ప్రభావితం చేస్తున్నాయి. ఇద్దరి కన్న ఎక్కువ పిల్లల్ని కన్న దంపతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి రోజులు వస్తున్నాయని చంద్రబాబు నాయుడు పేర్కొనడం గమనించదగిన అంశంగా భావించాలి.

5,000 ఏండ్ల క్రితం ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటూ నాటి పాలకులు ప్రజలను ప్రోత్సహించే వారని, అలాంటి విచిత్ర పరిస్థితులు దక్షిణాదిన వచ్చాయని రాజకీయ నాయకులు పేర్కొంటున్నారు. ఉత్తర భారతాన మహిళలకు స్వేచ్ఛ లేకపోవడం, అవిద్య, లింగ అసమానతలు, కడు పేదరికం లాంటి సమస్యలతో సంతానోత్పత్తి రేటు పెరగడం జరుగుతున్నది. అత్యధిక జనాభా కలిగిన భారతంలో దక్షిణాదిన జనాభా పెరగాలంటూ ఇక్కడి రాజకీయ నాయకులు ఏకరువు పెట్టడం కొంత విస్మయానికి గురి చేస్తున్నది.

రాజకీయాలకే అధిక జనాభా కావాలా !

పేదరిక భారతంలో పుట్టిన పిల్లలకు ఆరోగ్యకర పర్యావరణం, పోషకాహారం, ఉన్నత విద్యావకాశాలు, భద్రత, శారీరక మానసిక ఆరోగ్యం, లింగ సమానత లాంటి కనీస హక్కులు కల్పించే స్థాయిలో దేశం ఉండాలి. యూనిసెఫ్ ప్రకటించినట్లు అధిక జనాభాతో పెరుగుతున్న భూతాపం, ప్రతికూల వాతావరణ మార్పులు, విపత్తులు, కరువు కాటకాలు, అకాల వర్ష వడగండ్లు, ఆకలి చావులతో పాటు జీవనోపాధి సమస్యలు ఉత్పన్న అవుతాయని మరువరాదు. నేటి పిల్లలు రేపటి కుటుంబాలను, వృద్ధులను, వారి సంతానాన్ని పెంచి పోషించే స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించాలి. ఈ స్థాయికి నేటి పిల్లలు, రేపటి యువత చేరడానికి ఆర్థిక వనరులు, ప్రజలకు కనీస నివాసయోగ్య సదుపాయాలు ఉన్నాయా ? ఇలాంటి వినూత్నమైన జనాభా సంక్షోభాలు ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్నాయి. నేటి మహిళాలోకం పిల్లల్ని అధికంగా కంటేనే రేపటి తరంలో కార్మికులు, శ్రామికులు, కర్షకులు, విద్యావంతులు, ఉద్యోగులు, వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు, సైనికులు, రాజకీయ నాయకులు, పార్టీలకు కార్యకర్తలు, ఓటర్లు లాంటి వర్గాలు కనిపిస్తాయని నేటి రాజకీయ నాయకులు పేర్కొనడం చూస్తున్నాం, విస్తుపోతున్నాం.

లింగ సమానత్వ సాధన, మహిళలకు ఉన్నత విద్యావకాశాలు, మాతాశిశు ఆరోగ్యం, నివాసయోగ్య ధరణి, సామాజిక భద్రత లాంటివి కల్పించగలిగితేనే నేటి జనాభా పెరుగుదలకు అర్థం ఉంటుందని గమనించాలి. రేపటి జనాభాకు నేటి నుంచే సంరక్షణ మార్గాలను వెతకాలి. పెరుగుతున్న జనాభాను దేశానికి ఓ నైపుణ్య ఆస్తిగా మార్చాలి. రేపటి తరం దేశానికి బరువు కాకుండా భాధ్యతగల పౌరులుగా ఎదగాలి, దేశ శ్రేయస్సుకు చిరునామాగా నిలవాలి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దు.

**కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి.**
**-నాదులాపూర్ శివారులో వరి కోత పనులు పరిశీలించిన కలెక్టర్.**
**-డాకూర్ ,నాదులాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను , ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు .**

సంగారెడ్డి, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి):రైతులు ఆరుగాలం శ్రమించి తాము పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు.



మంగళవారం అందోల్ మండలం ,డాకూర్ ,నాదులాపూర్ లలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ – ఐ కె పి ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, నాదులాపూర్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు . సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని తూకం వేయాలని రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంట వెంటనే జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సీరియల్ రిజిస్టర్ ను కలెక్టర్ పరిశీలించారు. చివరి గింజ వరకు కొనాలని అధికారులను ఆదేశించారు .కొనుకోలు కేంద్రాలవద్ద నిర్వహణ దారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదేశించారు .ఈ సందర్భంగా గ్రామ శివారు లో హార్వెస్టర్ సహాయంతో నిర్వహిస్తున్న వరి కోత పనులను కలెక్టర్ పరిశీలించారు . హార్వెస్టర్ తో వరికొస్తున్న పొలం లోకి దిగి వరి కోతవిధానాన్ని పరిశీలించారు. వరి కోత యంత్రం వేగం ఎంత పెట్టి వరి కోస్తున్నారని యంత్ర యజమానిని ప్రశ్నించారు ? కోత సమయంలో మిషన్ ఆర్పిఎం 18 కన్నా ఎక్కువ ఉండేలా చూడాలని తద్వారా రైతుల ధాన్యంలో తాలు చెత్త లేకుండా నాణ్యమైన ధాన్యం వచ్చే అవకాశం రైతులకు సూచించరారు.

అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. మధ్యాన్నం భోజన పథకాన్ని పరిశీలించారు. ఆహారంలో పోషకవిలువలను పరిగణం లోకి తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు . ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు .ప్రభుత్వ పాఠశాలలో మెరిట్ ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు ఉపాధ్యాయుల విద్యా ప్రమాణాలు పై అవగాహన కల్పించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ , జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి జ్యోతి , అదనపు పి డి డి ఆర్ డి ఓ జంగారెడ్డి , ఐ కే పి సిబ్బంది పాల్గొన్నారు

# సంయుక్త సంస్థను ఏర్పాటు చేసిన మహారత్న ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్టీపీసీ, ఓఎన్జీసీ

న్యూఢిల్లీ, నవంబర్ 5:స్థలైన ఎన్టీపీసీ, ఓఎన్జీసీ ఉమ్మడి భాగస్వామ్యంతో తమ హరిత ఇంధన అనుబంధ సంస్థల (ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, ఓఎన్జీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్) ద్వారా ఓ సంయుక్త సంస్థను ఏర్పాటు చేశాయి. పునరుత్పాదక, నవీన ఇంధన రంగంలో వాటి ప్రయోజనాలను ప్రోత్సహించే దిశగా ఇది ముందడుగు.

భారత ఇంధన వారోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 7న జాయింట్ వెంచర్ ఒప్పందం కుదిరింది. దీపం (డీఐపీఏఎం), నీతి ఆయోగ్ ల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొందిన అనంతరం ఓజీఎల్ తో 50:50 జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటుకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఎన్జీఈఎల్ దరఖాస్తు సమర్పించింది.

సౌర, పవన (సముద్ర/తీరప్రాంత), ఇంధన నిల్వ (పంప్/బ్యాటరీ), హరిత అణు (హరిత హైడ్రోజన్, హరిత అమ్మోనియా, పర్యావరణ హిత వైమానిక ఇంధనం, హరిత మిథనాల్), చాలక పద్ధతుల్లో విద్యుదీకరణ (ఇ–మొబిలిటీ), కర్బన పరిమితి (కార్బన్ క్రెడిట్), హరిత ప్రోత్సాహకాలు (గ్రీన్ క్రెడిట్స్) సహా వివిధ పునరుత్పాదక, నవీన ఇంధన రంగాల్లోకి ఈ జాయింట్ వెంచర్ కంపెనీ ప్రవేశించనుంది.

పునరుత్పాదక ఇంధన వనరులను సమకూర్చుకోవాలని కూడా కంపెనీ భావిస్తోంది. తమిళనాడు, గుజరాత్‌లలో తీరప్రాంత పవన టెండర్లలో పాల్గొనే అంశాన్నీ పరిశీలిస్తోంది.

హరిత భవిత కోసం దేశ ప్రతిష్ఠాత్మక లక్ష్యాలకు అనుగుణంగా, సుస్థిర ఇంధన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే దిశగా సమష్టి కృషిని ఎన్జీఈఎల్ ? ఓజీఎల్ మధ్య ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం సూచిస్తుంది. ఆయా రంగాల్లో వాటి నైపుణ్యం, వనరుల దృష్ట్యా రెండు సంస్థలూ భారత పునరుత్పాదక ఇంధన రంగంలో విశేష సేవలందించడానికి సిద్ధంగా ఉన్నాయి. అది ఆవిష్కరణలను ప్రోత్సహించడం తోపాటు పర్యావరణ పర్యవేక్షణను పెంపొందిస్తుంది.

# ప్రజావాణికి 46 ఫిర్యాదులు - స్వీకరించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్.



సంగారెడ్డి, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి):జిల్లా వ్యాప్తంగా ప్రజావాణి కార్యక్రమం లో వచ్చిన ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు . సోమవారం ప్రజావాణి ఐసీసీ జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి 46 ఫిర్యాదులు అందాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , డి ఆర్ ఓ పద్మజా రాణి ,లకు విన్నవించారు . తమ సమస్యల పై తక్షణ పరిష్కారాలు చూపాలని అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదుదారులు హాజరైయ్యారు.

ఈ సందర్భముగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడారు . తమ సమస్యలను వివరంగా వినిపించిన ప్రతి ఫిర్యాదుదారుని, వారి అర్జీలను ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఫిర్యాదులు అన్‌లైన్ లో నమోదు చేయడం, వాటిని పర్యవేక్షించడం , సకాలంలో పరిష్కరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను ప్రతి శాఖల పరంగా ,వారికి చెందిన ప్రతినిధులైన అధికారులు తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని, పెండింగ్ ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా, ఫిర్యాదుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు, అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఏ శాఖ అయినా తమకు సంబంధించిన సమస్యలపై సత్వరమే స్పందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సూచించారు .

# చెన్నై ఓడరేవులో కొత్త తీరప్రాంత రహదారి, ఎగుమతులు- దిగుమతులకు ఉద్దేశించిన గోదాములు, తీరప్రాంతంలో విద్యుత్తు సదుపాయాలు



న్యూఢిల్లీ, నవంబర్ 5:కేంద్ర ఓడరేవులు, నౌకారవాణా, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఈ రోజు చెన్నైలో పర్యటించారు. చెన్నై పోర్ట్ అథారిటీ (సిహెచ్‌పీఏ)లో, కామరాజర్ పోర్ట్ లిమిటెడ్ (కేపీఎల్)లో అనేక ముఖ్య ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. మొత్తం రూ.187.33 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టులను మొదలుపెట్టారు. ఈ ప్రాజెక్టులు ఓడరేవుల్లో ఇప్పుడున్న వసతి సౌకర్యాలను మరింత పెంచి, వ్యాపార కార్యకలాపాలు ఇంకా సాఫీగా జరిగేటట్లు చూడటంతో పాటు భారతదేశం ప్రాధాన్యమిస్తున్న గ్రీన్ పోర్ట్ కార్యక్రమాలను ఇంకా ముందుకు తీసుకుపోనున్నాయి.

ఓడరేవులను ఆధునికీకరించడానికి, నౌకావాణిజ్యానికి అవసరమయ్యే సంధాన సదుపాయాల్ని పెంచడానికి తమ మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు. ప్రపంచ వ్యాపారంలో భారతదేశాన్ని ఒక కీలక పాత్రధారిగా నిలబెట్టడంలో ఈ ప్రాజెక్టులది ముఖ్య పాత్ర అని ఆయన అన్నారు.

అధిక ప్రభావాన్ని చూపే అనేక ప్రాజెక్టులను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల్లో ఎగుమతి – దిగుమతులకు ఉద్దేశించిన 4 కొత్త గోదాములను రూ.73.91 కోట్ల ఖర్చుతో చెన్నై పోర్టులో నిర్మించడం కూడా ఒకటిగా ఉంది. ఈ గోదాములు 18,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటవుతూ వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ధాన్యాలు సహా ఇతర ముఖ్య సరకులను నిలవ చేయడానికే ప్రత్యేకించిన, పైకప్పుతో కూడిన నిలవ వసతిని కలిగి ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులన్నిటిని సాగర్‌మాల పథకంలో భాగంగా అందించనున్నారు. ఈ ప్రాజెక్టును పెరుగుతున్న గిరాకీకి తగ్గట్టు ప్రధాన ఓడరేవుల్లో వ్యాపార సామర్థ్యాన్ని విస్తరించాలన్న భారతదేశం లక్ష్యానికి అనుగుణంగా రూపొందించారు. 350 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పులతో ఒక కాంక్రీటు తీరప్రాంత రహదారిని కొత్తగా నిర్మించగా, మంత్రి ఆ రోడ్డును ప్రారంభించి, అంకితం చేశారు. ఒక్క గోదాములే కాకుండా, రూ.4 కోట్ల ఖర్చుతో అభివృద్ధి పరచిన ఈ కొత్త రహదారి చెన్నై పోర్టులోని రెండో కంటైనర్ టర్మినల్ (సిఐటీపీఎల్) వద్దకు భారీ సరకు రవాణా కంటైనర్‌లు ఎలాంటి ఇబ్బంది లేకుండా తరలి వెళ్ళేందుకు అనువుగా ఉంది. ఈ కొత్త రోడ్డు పోర్టుకు చేరికను పెంచనుంది; దుమ్మును, ధూళిని తగ్గించి వేస్తూ పర్యావరణ సంబంధిత నియమాల అనుసరణకు వీలు కల్పిస్తుంది. ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఓడరేవులో ఇప్పటికే ఉన్న వసతి, సదుపాయాలు చాలా మెరుగుపడనున్నాయి.


# పవన్ వ్యాఖ్యలపై డిజిపి ద్వారకా తిరుమలరావు నో కామెంట్

అమరావతి, నవంబర్ 5: ఆంధ్రప్రదేశ్ లో గత ఐదేళ్లలో కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమేనని డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై డీజీపీ తాజాగా స్పందించారు. డిప్యూటీ సీఎం వ్యాఖ్యలపై తాను ఎలాంటి కామెంట్ చేయబోనని చెప్పారు. ఈమేరకు మంగళవారం అనంతపురంలో డీజీపీ మీడియాతో మాట్లాడుతూ,. గత ప్రభుత్వ హయాంలో కొన్ని పొరపాట్లు, తప్పులు జరిగాయని ఒప్పుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆ తప్పులను సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

తాము రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని.. రాజకీయ ఒత్తిళ్లతో మేం పని చేయబోమని స్పష్టం చేశారు.. వాస్తవ పరిస్థితుల ఆధారంగానే ఏ కేసు నైనా విచారిస్తాం అన్నారు ఏపీ డీజీపీ.. గతంలో నేరస్తున్న పట్టుకునేందుకు ఫింగర్ ప్రింట్స్ టెక్నాలజీ ఉన్నా ఉపయోగించుకోలేదని విమర్శించారు.. డీజీపీ ఆఫీస్ లో సంతకాలు చేస్తున్న వారిలో 10 మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్ ఇచ్చామని.. మిగిలిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం అన్నారు.

ఏపీలో మానవ హక్కులు, మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని డీజీపీ చెప్పారు. పోలీసు వ్యవస్థను ప్రజలకు బాధ్యతాయుతంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు కూడా సరిగా విధులు నిర్వహించలేదని, ఓ పార్టీ కార్యాలయంపై దాడి జరిగినా బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని డీజీపీ చెప్పారు.

# ఆస్కార్ పురస్కారాల షార్ట్ ఫిల్మ్ విభాగానికి ఎంపికైన ఎఫ్టీఐఐ విద్యార్థి సినిమా- "సన్ ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ టు నో"






న్యూఢిల్లీ, నవంబర్ 5:ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్టీఐఐ) విద్యార్థి దర్శకత్వం వహించిన "సన్ ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ టు నో" సినిమా... 2025 ఆస్కార్ పురస్కారాల 'లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్' విభాగానికి ఎంపికయ్యింది.

ఎఫ్టీఐఐ విద్యార్థి చిదానంద ఎస్ నాయక్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం.. ఈ ఏడాది మొదట్లో జరిగిన కేన్స్ చిత్రోత్సవ విద్యార్థి విభాగంలో తొలి స్థానాన్ని దక్కించుకుంది. భారతీయ జానపద గాథలూ, సంప్రదాయాలను ప్రతిబింబించిన ఈ కన్నడ సినిమా.. కేన్స్ పురస్కారాన్ని గెలుపొందడంతో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

చిదానంద ఎస్ నాయక్ ఎఫ్టీఐఐ విద్యార్థిగా ఉన్న సమయంలో దర్శకత్వం వహించిన "సన్ ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ టు నో" కి, సూరజ్ ఠాకూర్ (సినిమాటోగ్రఫీ), మనోజ్ వీ (ఎడిటర్), అభిషేక్ కదమ్ (సౌండ్ డిజైన్) తమ నైపుణ్యాలను జోడించారు. ఇక కథ విషయానికి వస్తే, ఊర్లోని కోడిపుంజుని ఒక ముసలవ్వ దొంగిలించడంతో ఊరిని చీకటి కమ్మేస్తుంది. సూర్యకాంతి దక్కని పరిస్థితి గ్రామంలో రేపిన అలజడిని విషాదం నేపథ్యంలో అత్యంత ప్రతిభావంతంగా చూపుతుందీ చిత్రం. తిరిగి మామూలు పరిస్థితులను రప్పించేందుకు భవిష్యవాణి సహాయాన్ని తీసుకుంటారు గ్రామస్తులు. జోస్యం వల్ల గ్రామ బహిష్కరణకు గురైన ముసలవ్వ కుటుంబ సభ్యులు కోడిపుంజుని వెతికి అప్పజెప్పేందుకు అనేక పాట్లు పడతారు. చిత్రాన్ని వీక్షించిన విద్యార్థి విభాగం జ్యూరీ సభ్యులు దర్శకుడి ప్రతిభను ప్రశంసిస్తూ "చిమ్మచీకట్లో సైతం చిదానంద్ ఎస్ నాయక్ దర్శకత్వ ప్రతిభ వెలుగులీనింది. మిరుమిట్లు గొలిపే కథన శైలిలో హాస్యాన్నీ, నైపుణ్యాన్నీ రంగరించినందుకు 'సన్ ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ టు నో' సినిమాకు మొదటి బహుమతిని అందిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు.

దర్శకుడు చిదానంద్ ఎస్ నాయక్ స్పందిస్తూ, "ఈ కథను చెప్పాలని ఎంతో కాలం ఉవ్విళ్లూరాను. ఎప్పుడో విన్న కథను మామూలుగా చెప్పడం కాక, విన్న తొలిసారి మాకు కలిగిన అద్భుతమైన అనుభూతి ప్రేక్షకులకు చేరాలని ఆశించాం. మా ఈ ప్రయత్నం ప్రపంచ ప్రేక్షకులకు అద్వితీయమైన అనుభవంగా మిగలగలదని ఆశిస్తున్నాం" అని అన్నారు.

మొత్తంగా రాత్రి పూట మాత్రమే చిత్రీకరించిన ఈ సినిమా.. ప్రేక్షకులను భారతీయ జీవన విధానంలో లీనం చేస్తూ, వారికి విలక్షణమైన భారతదేశ సంస్కృతినీ వాతావరణాన్ని పరిచయం చేస్తుంది. సాంప్రదాయిక కథన పద్ధతుల ద్వారా చెప్పిన కథలో.. గ్రామీణ ప్రాంతాల రమణీయతను, కథలతో ప్రజలకున్న బలమైన అనుబంధాన్నీ దర్శకుడు దృశ్యమానం చేసిన విధానం అనేకుల మెప్పు పొందింది. 'బెంగళూరు అంతర్జాతీయ లఘు చిత్రోత్సవం' లో 'బెస్ట్ ఇండియన్ కాంపిటీషన్ అవార్డు' దక్కించుకున్న 'సన్ ఫ్లవర్స్..' సినిమా, అనేక ఇతర చిత్రోత్సవాల్లో గుర్తింపు పొందుతూ, ప్రపంచ అత్యుత్తమ లఘు చిత్రాలతో పోటీ పడుతోంది. ఇక పోటీలో గెలుపొందేందుకు, ప్రత్యేక ప్రదర్శనలు, ప్రశ్నోత్తర కార్యక్రమాలు, విలేకరుల సమావేశాల వంటి ప్రచార కార్యక్రమాల ద్వారా అటు ఆస్కార్ అకాడమీ సభ్యులకే కాక, ప్రపంచ ప్రేక్షకులకు భారతీయ కథా సంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తారు. సినిమాకు దక్కుతున్న ప్రశంసల మాట అటుంచితే, ప్రపంచ ప్రేక్షకులను ఆకర్షించే భారతీయ సంస్కృతి, ప్రభావవంతమైన కథా సంప్రదాయాల్లోని విశ్వజనీనతను ఎత్తి చూపడంలో సన్ ఫ్లవర్స్ చిత్రం తనదైన ముద్ర వేస్తోంది.

# జిల్లాను అభివృద్ధి పథంలో పరిగెత్తిస్తాం- ఎంపీ కేశినేని చిన్ని




అమరావతి, నవంబర్ 5:ఎన్టీఆర్ జిల్లాను రానున్న రోజుల్లో అభివృద్ధి పథంలో పరిగెత్తించేందుకు అవసరమైన ప్రణాళికలన్నీ సిద్ధం చేశామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రాల సమిష్టి సంపూర్ణ సహకారంతో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా వేగవంతం చేస్తామన్నారు. గ్రామీణ రహదారులకు కనెక్టివిటీ పెంచడంతో పాటు రైతులకు ఎంతో ఉపయోగమైన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మంచి పౌష్టికాహారం అందించే దిశగా హైజీనిక్ కిచెన్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి ఆయన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేసినేని శివనాథ్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎన్టీఆర్ జిల్లాలో ఏ విధంగా అమలు అవుతున్నాయో తెలుసుకోవటమే దిశా కమిటీ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్టీఆర్ జిల్లా జల్ జీవన్ మిషన్ పథకం అమలు విషయంలో ఐదో స్థానంలో వుందని, జల్ జీవన్ మిషన్ ద్వారా సోర్స్ ఆఫ్ వాటర్ నుంచి టాప్ కనెక్షన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించేందుకు డీపీ ఆర్ లు రెడీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఎన్టీఆర్ జిల్లాలో ముందు స్థానంలో వుండే విధంగా అధికారులతో కలిసి కృషి చేయబోతున్నట్లు ప్రకటించారు. జిల్లాలో వున్న అన్ని పి.హెచ్.సి ల్లో మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించి అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాల్లో హైజీనిక్ కిచెన్ ఏర్పాటు చేసే విషయంపై చర్చించటం జరిగిందని, త్వరలోనే అధికారి రూపం దాల్చుతుందన్నారు.

ప్రైమ్ మినిస్టర్ సడక్ యోజన్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కనెక్టివిటీ పెంచే విషయంపై చర్చించినట్లు తెలిపారు. దేశంలోనే ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ ముందు వుందని జిల్లాలో కూడా మరింత ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ రంగంలో కూడా డ్రోన్స్ వినియోగించేందుకు రైతులకి అవగాహన కల్పిస్తామని, సెంట్రల్ స్కీమ్స్ ద్వారా డ్రోన్స్ కి సబ్సిడీ వచ్చే అవకాశం వుందన్నారు. హైదరాబాద్ లోని ఎన్.ఐ.ఆర్.డి ద్వారా ఉపాధి కల్పించేందుకు ఎన్నో స్కీమ్స్ వున్నాయని, అక్కడ యువతకి, రైతులకి శిక్షణ ఇప్పిస్తామన్నారు. అగ్రికల్చర్,ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పిన ఆయన తిరువూరులో ఎన్.ఐ.ఆర్.డి ద్వారా క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పించటమే సీఎం చంద్రబాబు లక్ష్యం అనే ఆ దిశగా అధికారులు సైతం చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల సహకారంతో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎంపీ కేసినేని శివనాథ్ తెలిపారు. ఈ సమావేశంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, జగ్గంపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఇన్చార్జి కలెక్టర్ తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దేశబంధు చిత్తరంజన్ దాస్ జయంతి సందర్భంగా పార్లమెంటేరియన్ల నివాళి

న్యూఢిల్లీ, నవంబర్ 5:దేశబంధు చిత్తరంజన్ దాస్ జయంతి సందర్భంగా సంవిధాన్ సదన్ లోని సెంట్రల్ హాల్లో ఆయన చిత్రపటం వద్ద ఈ రోజు లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా, ఇతర పార్లమెంటేరియన్లు పుష్పాంజలి ఘటించారు. పార్లమెంటు సభ్యులు, లోక్ సభ సెక్రటేరియట్, రాజ్యసభ సెక్రటేరియట్ లకు చెందిన సీనియర్ అధికారులు, ఇతరులు.. చిత్తరంజన్ దాస్ కు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా చిత్తరంజన్ దాస్ జీవిత వివరాలతో కూడిన చిన్న పుస్తకాన్ని హిందీ, ఇంగ్లిషు భాషల్లో లోక్ సభ సెక్రటేరియట్ ప్రచురించింది. కార్యక్రమానికి హాజరైన ఆహూతులందరికీ ఈ చిన్ని పుస్తకాన్ని బహూకరించారు.

నవంబరు 5, 2024 దేశబంధు చిత్తరంజన్ దాస్ జయంతి సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్లో నివాళి అర్పిస్తున్న లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా.

సంవిధాన్ సదన్- సెంట్రల్ హాల్లోని దేశబంధు చిత్తరంజన్ దాస్ చిత్ర పటం వద్ద నివాళి అర్పించిన అనంతరం? లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా, పార్లమెంటు సభ్యులు, ఇతర అతిథులు.

1958, సెప్టెంబరు 12వ తేదీన అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ దేశబంధు చిత్తరంజన్ దాస్ చిత్రపటాన్ని సంవిధాన్ సదన్ లోని సెంట్రల్ హాల్లో ఆవిష్కరించారు.

# టెక్ రంగంలో.. బెస్ట్‌గా నిలుద్దాం-ఐటీ, డ్రోన్, సెమీకండక్టర్ల పాలసీపై సీఎం సమీక్ష

-ఏపీని అన్నింటా టాప్‌లో ఉంచుదాం
-ఐటీ, డ్రోన్, సెమీకండక్టర్ల పాలసీపై సీఎం సమీక్ష
-సచివాలయంలో హైలెవల్ ఆఫీసర్లతో భేటీ
-ఏఐ హబ్‌గా మార్చేందుకు పాలసీల్లో మార్పులు
-డ్రోన్ పరిశ్రమలకు అనంత కేంద్రం కావాలి
-సెమీ కండక్టర్లకు శ్రీసిటీ సెంటర్ చేద్దాం
-ఐటీ రాజధానిగా విశాఖను మారుద్దాం
-పాలసీ ప్రకారం ముందుకెళ్లాలని సూచించిన సీఎం

అమరావతి, నవంబర్ 5:మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక రంగంలో మార్పులు రావాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

ఏపీని ఏఐకి హబ్‌గా మార్చాలనే ఉద్దేశంతో పలు పాలసీల్లో మార్పులు తీసుకువస్తున్నట్టు చెప్పారు. ఐటీ, డ్రోన్, సెమీకండక్టర్ పాలసీలపై సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు.. ఈ సమీక్షలో సీఎస్



నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. డ్రోన్ పరిశ్రమలు స్థాపించే వారికి గమ్యంగా అనంతపురం ఉండాలని అన్నారు. సెమీ కండక్టర్ల హైబ్‌గా శ్రీ సిటీని మార్చాలని అధికారులకు సీఎం సూచించారు.. ఇక ఐటీ రాజ ధానిగా విశాఖను తీర్చిదిద్దాలని అన్నారు.

# రేపటి నుంచీ15 రోజులపాటు జల్ ఉత్సవ్

న్యూఢిల్లీ, నవంబర్ 5:'జల్ ఉత్సవ్' ను రేపటి నుంచి 15 రోజుల పాటు నీతి ఆయోగ్ నిర్వహించనుంది. జల నిర్వహణ, జల సంరక్షణ, జల వనరులను ఎక్కువకాలం పాటు వినియోగించుకొనేటట్టు చూసుకోవడం.. ఈ విషయాలపై ప్రజల్లో చైతన్యాన్ని తీసుకుని రావాలన్నది ఈ ఉత్సవ ఉద్దేశం. డిసెంబరు-2023 లో జరిగిన ప్రధాన కార్యదర్శుల మూడో సమావేశం సందర్భంగా 'నదీ ఉత్సవ్' మాదిరిగానే 'జల్ ఉత్సవ్'ను కూడా నిర్వహించాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేసిన సూచనకు అనుగుణంగా ఈ ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు.

నేషనల్ జల్ జీవన్ మిషన్, తాగునీరు - పారిశుధ్య విభాగం (డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ డిపార్టుమెంట్- డీడీడబ్ల్యూఎస్), జల్ శక్తి మంత్రిత్వ శాఖల భాగస్వామ్యంతో జల ఉత్సవాన్ని- 20 ఆకాంక్షాత్మక జిల్లాలు/బ్లాకులలో ఈ నెల 6 నుంచి 24 వరకూ నిర్వహించనున్నారు. 20 రాష్ట్రాలలో ప్రారంభించే ఈ ఉత్సవంలో జల వనరులను కాపాడుకోవడంలో భాగంగా ప్రజలు పాలు పంచుకోవాలని పిలుపును ఇవ్వనున్నది. నీటిని అవసరం మేరకు వాడుకోవాలన్న జాగృతిని కుటుంబాల్లో కల్పించడం, నీటి నిర్వహణకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని నీటి సరఫరా సంస్థలకు, ఏజెన్సీలకు చెప్పడం - ఈ ఉత్సవ ఉద్దేశం. బడిపిల్లలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ద్వారా వారి కుటుంబాలలో, వారు ఉంటున్న పేటలలో నీటి వినియోగ ప్రాముఖ్యాన్ని వారు ప్రచారం చేసేటట్లు తగిన మెళకువలను అందిస్తారు.

# ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మేళనం (వేవ్స్) కంటే ముందే ఊపందుకున్న క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్- సీజన్ 1

న్యూఢిల్లీ, నవంబర్ 5:క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ - సీజన్ 1 (సీఐసీ)కి అపూర్వ స్పందన రావడంపై భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మేళనం (వేవ్స్) కంటే ముందే సీఐసీ జరుగుతుంది. వేవ్స్ కార్యక్రమం ఆధారంగా రూపొందించిన క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్, సృజనాత్మక వ్యక్తీకరణ, ఆవిష్కరణలకు వేదికను కల్పించడం ద్వారా ఈ లక్ష్యానికి జీవం పోసింది.

దేశీయంగా క్రియేటర్ ఎకానమీ మెరుగయ్యేలా ప్రభావాన్ని చూపడం, కంటెంట్ సృష్టికర్తలు, ఆవిష్కర్తలు తమ ప్రతిభను ప్రదర్శించి, నైపుణ్యాలను ఉపయోగించి ఆర్జించడం, తద్వారా భారతీయ మీడియా, వినోద పరిశ్రమ వృద్ధికి దోహదపడటమే లక్ష్యంగా సీఐసీని రూపొందించారు. ఇది ఈ రంగంలో ప్రపంచ స్థాయిలో భారత్ శక్తిని మెరుగుపరుస్తుంది. అలాగే సృజనాత్మకత కలిగిన ప్రతిభావంతులకు ప్రయోగ కేంద్రంగా పనిచేసి, వారిని అంతర్జాతీయ గుర్తింపు దిశగా నడిపిస్తుంది.

ఆగస్ట్ 22, 2024న ప్రారంభమైన సీఐసీ, 27 విభిన్న అంశాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీదారులను ఆకర్షిస్తోంది. ట్రూత్ టెల్ హ్యాకథాన్, కామిక్స్ క్రియేటర్ ఛాంపియన్‌షిప్, ఈ-స్పోర్ట్స్ టోర్నమెంట్, ట్రైలర్ మేకింగ్ కాంపిటీషన్, థీమ్ మ్యూజిక్ కాంపిటీషన్, ఎక్స్ఆర్ క్రియేటర్ హ్యాకథాన్, ఏఐ అవతార్ క్రియేటర్, యానిమి ఛాలెంజ్ సహా ఇతర అంశాల్లో పోటీలు జరుగుతాయి.

మీడియా, ఎంటర్టైన్మెంట్ రంగంలో ప్రసారాలు, ప్రకటనలు, సంగీతం, ఏవీజీసీ-ఎక్స్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా, సినిమాలు, నూతన టెక్నాలజీలతో సహా ఇతర విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు.

దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొనే వారి సంఖ్యను పెంచడానికి వివిధ సంస్థల సహకారంతో రోడ్ షోలను విజయవంతంగా నిర్వహించారు. ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (ఐజీడీసీ) తోడ్పాటుతో సెప్టెంబర్ 20న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో 50 మంది నిపుణులతో సహా 250 మందికి పైగా పాల్గొన్నారు. ఏవీజీసీ రంగం ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ఫిక్కీ సహకారంతో సెప్టెంబరు 28న జరిగిన చెన్నై వేగాస్ ఫెస్ట్ 5,000 కంటే ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షించింది. అలాగే అక్టోబర్ 5న మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ), ఏబీఏఐ ఏవీజీసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)తో కలిసి బెంగళూరులో రోడ్‌షో నిర్వహించారు. ఈ రంగానికి చెందిన 40-50 సంస్థలు, అసోషియేషన్ల మధ్య విలువైన చర్చలకు వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.

త్వరలో జరగబోయే క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ (అఎఅ) సీజన్ ? 1, ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మేళనం (వేవ్స్)లో విస్తృత స్థాయిలో ప్రేక్షకులు, భారతీయ సృజనాత్మక సంస్థల భాగస్వామ్యాన్ని పెంచేందుకు దేశమంతటా మీడియా, వినోద కార్యక్రమాలను చేపడుతూ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చురుకుగా వ్యవహరిస్తోంది.

ఇప్పటి వరకు ఈ పోటీలకు 10 వేల కంటె ఎక్కువగానే రిజిస్ట్రేషన్లు వచ్చాయి. ఈ సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ విజయాన్ని పునాదిగా చేసుకుని దేశవ్యాప్తంగా రోడ్ షోలు నిర్వహించేందుకు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. యువత, విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు ఉన్నత విద్యాసంస్థలతో కలసి పనిచేస్తోంది. సృజనాత్మక రంగాలైన డిజిటల్ మీడియా, ఏవీజీసీ, తదితర నూతన టెక్నాలజీల సామర్థ్యాన్ని విద్యార్థులు, వర్ధమాన సృష్టికర్తలు గుర్తించేలా చేయడంతో పాటు, ఈ రంగాల్లో వారిని ప్రోత్సహించేందుకు తోడ్పడుతుంది.

వేవ్స్, క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ ప్రభావాన్ని మరింత విస్తరించేందుకు, విస్తృత ప్రచారం దిశగా మంత్రిత్వ శాఖ ప్రణాళిక రచిస్తోంది. దీనిలో భాగంగా సోషల్ మీడియా భాగస్వామ్యాలతో పాటు దేశవ్యాప్తంగా 28 చోట్ల రోడ్ షోలు నిర్వహిస్తుంది. వీటితోపాటు అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశాల్లోనూ రోడ్ షోలు నిర్వహిస్తారు. ఇవి పోటీదారుల్లో ఉత్సుకతను కల్పించి, ప్రపంచ వ్యాప్తంగా ఈ పోటీల్లో పాల్గొనే వారి సంఖ్యను పెంచుతాయి.

# కుప్పంలో వైసిపికి ఎదురు దెబ్బ - మునిసిపల్ చైర్మన్ సుధీర్ రాజీనామా

-చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిక
-సైకిల్ ఖాతాలో కుప్పం మునిసిపాలిటీ

అమరావతి, నవంబర్ 5: ఏపీ సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో సుధీర్ టీడీపీ కండువా కుప్పుకున్నారు.

వైసీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేసిన అనంతరం సుధీర్ టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన లేఖను కుప్పం మున్సిపల్ కమిషనర్‌కు పంపించానని తెలిపారు. చంద్రబాబుతో కలిసి నడిచేందుకే అన్ని పదవులకు రాజీనామా చేశానని పేర్కొన్నారు. కాగా ఇప్పటి వరకు వైసిపి చేతిలో ఉన్న కుప్ప మునిసిపాలిటీ సుధీర్ రాజీనామా చేయడంతో టిడిపి చేతికి చిక్కింది.

# సరస్వతి పవర్ భూములపై పవన్ కల్యాణ్ గరం గరం

-భయపెట్టి, బాంబులు వేసి స్వాధీనం చేసుకున్నారు
-మాచవరంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన
-జగన్ కు కేటాయించిన భూముల పరిశీలన
-అటవీ భూమి, అసైన్డ్ భూములను లాక్కున్నారు
-ప్రైవేటు భూములను చెరబట్టారు
-రైతు పిల్లలకు ఉద్యోగాలంటూ ఎర
-భారీగా నష్ట పరిహారం ఇస్తామంటూ మోసం
-కృష్ణా జలాలు అడ్డగోలుగా కేటాయింపు
-ఇప్పటికే విచారణ ప్రారంభించాం..
-ఈ భూ దందాలో అందరినీ జైలుకు పంపుతాం

అమరావతి, నవంబర్ 5:మోసం చేసి, భయపెట్టి, బాంబులు వేసి సరస్వతి పవర్ కోసం 1324. 93 ఎకరాల భూమిని చెరబట్టారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగానే దీనికి నాంది పలికిందని చెప్పారు. జిల్లాలోని మాచవరం మండలంలో మాజీ సిఎం జగన్ కు చెందిన సరస్వతి పవర్ కేటాయించిన భూములను నేడు స్వయంగా పవన్ పరిశీలించారు.. ఈ సందర్భంగా అక్కడ భూములు ఇచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు.

అనంతరం పవన్ మాట్లాడుతూ ఈ భూముల అక్రమాలపై ఇప్పటికే విచారణ ప్రారంభించామన్నారు. ఈ భూముల్లో ఏకంగా 150 ఎకరాలకు పైగా అటవీ భూమి ఉందన్నారు.. ఇక మరో 34ఎకరాలు అసైన్ట్ భూమిని సైతం కబ్జా చేశారన్నారు.. ఇది కాకుండా ఇక్కడ రైతులను మభ్య పెట్టి వారి భూములను సైతం లాక్కున్నారని తెలిపారు.. రైతు పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని, భారీగా నష్ట పరిహారం ఇస్తామని వ్యవసాయ భూములను సైతం లాక్కున్నారని వివరించారు. భూములు ఇవ్వని వారిపై బాంబులు వేశారని, కత్తులతో దాడులు చేశారన్నారు. భూమిలిచ్చిన రైతులకు నేటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదని, అలాగే ఒక్క రైతుకు నష్టపరిహారం అందలేదని పవన్ చెప్పారు. ఇక ఈ భూములను ఏకంగా జగన్ తాను అధికారంలో ఉండగా 50ఏళ్లకు లీజు తీసుకున్నట్లు జీవో విడుదల చేశారని గుర్తు చేశారు. జగన్ కృష్ణా జలాలను సైతం వదలలేదన్నారు.. అక్రమంగా ఆ నదీ జలాలను తన సిమెంట్ పరిశ్రమ కోసం కేటాయించుకున్నారని మండిపడ్డారు.

సిమెంట్ పరిశ్రమ రాలేదు కానీ, ఈ భూముల నుంచి వేలాది టన్నుల సున్నపు రాయి తరలిపోయిందన్నారు.. ఇలా భూకబ్జాకు పాల్పడిన సరస్వతి పవర్ ను వదిలేది లేదన్నారు. దివంగత నేత కోడెల శివప్రసాద్ తన వద్ద ఫర్నీచర్ ఉంచుకున్నందుకు వేధించి బలవన్మరణానికి కారణమైన నేతలే ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారని అన్నారు పవన్. ఈ భూబాగోతంలో ఎవరున్నా వదిలే ప్రసక్తి లేదన్నారు.. కేటాయించిన అధికారుల నుంచి దీనిని కబ్జా చేసిన జగన్ తో సహా ఇతరులను చట్టబద్దంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు పవన్.

# పిఠాపురం పర్యటనలో పవన్ కు సమస్యల వెల్లువ

-ప్రజల నుంచి సమస్యలు విన్న ఉప ముఖ్యమంత్రి
-ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరింత
-పవన్ తో తమ గోడును వినిపించుకున్న బాధితులు
-సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జనసేనాని భరోసా..
-ప్రతి చోట ప్రజలతో మమేకం.. నేనున్నా అంటూ హామీ

అమరావతి, నవంబర్ 5: నియోకవర్గ పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతి కార్యక్రమంలోనూ ప్రజలతో మమేకమయ్యారు. ఒక రోజుల పర్యటనలో ఆద్యంతం ప్రజా సమస్యలు



వింటూ.. వినతులు స్వీకరిస్తూ.. పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు జనసేనాని .. ప్రతి అడుగులో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ, సమస్య ఉన్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించి బాధితులకు భరోసా నింపుతూ పిఠాపురం నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి పర్యటన సాగింది. ఆయన రాక విషయం తెలుసుకుని ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు రోడ్ల వెంట బారులు తీరారు. పిఠాపురం, యు.కొత్తపల్లి మధ్య ప్రజలు తమ గ్రామాల సమస్యలు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై దృష్టి సారించి తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ప్రమాదంలో కాళ్లుపోయాయి.. బీమా రాలేదు

పిఠాపురం టీటీడీ కళ్యాణ మండపం వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వెళ్లిన సమయంలో శ్రీ అబ్రహం అనే దివ్యాంగుడు కలిసి, గోడ కూలిన ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయానని, సదరం సర్టిఫికెట్ ఆలస్యం కావడం వల్ల గత ప్రభుత్వంలో బీమా ఇవ్వలేదని. అదే ప్రమాదంలో చనిపోయిన ఇరువురికీ బీమా వర్తింపచేశారని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా తనకు న్యాయం జరగలేదని తన గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీ అబ్రహం సమస్య పరిష్కరించాలని వెంటనే అధికారులకు సూచించారు.

700 సంవత్సరాల చరిత్ర కలిగిన గోరస శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన 40 ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని, ఆలయ భూములు ఆక్రమించుకున్న వారంతా సిండికేట్ గా మారి దోచుకుంటున్నారంటూ ఆ గ్రామానికి చెందిన పలువురు పిఠాపురం, యు.కొత్తపల్లి మధ్య మార్గంలో వినతిపత్రం ఇచ్చారు. సీతారావస్వామి వారి భూములకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన పవన్ వెంటనే దాని సంగతి చూడాలని ఆదేశించారు.

నవ కంద్రవాడ గ్రామ సర్పంచ్ బి. సురేష్ తమ గ్రామంలో డ్రెయినేజ్, రహదారి సమస్యలను ఉప ముఖ్యమంత్రికి విన్నవించారు. గ్రామంలో జీర్ణావస్థకు చేరుకున్న రామాలయాల పునర్నిర్మాణం అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎండవల్లి జంక్షన్ సమీపంలోని వాకతిప్ప కాలనీ వాసులు తాగు నీటి సమస్యతో తాము పడుతున్న ఇబ్బందులను ఉపముఖ్యమంత్రికి వివరించారు. తగిన చర్యలకు పవన్ వెంటనే అధికారులకు సిపార్స్ చేశారు.

పిఠాపురం రైల్వే అండర్ పాస్ సమీపంలోని రథాలపేట రైల్వే ట్రాక్ పక్కన ఉన్న కాలనీ వాసులు తమ ప్రాంతంలో పారిశుధ్యం, రంగు మారిన రక్షిత మంచినీటి సరఫరా అంశాలను విన్నవించడంతో, వెంటనే వాహనం నుంచి దిగి వెళ్లి రథాలపేట కాలనీలో పారిశుధ్యం, రక్షిత మంచి నీటి సరఫరా తీరుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల పట్టాల సమస్యను కాలనీ వాసులు చెప్పడంతో, రథాలపేట కాలనీ వాసుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా కాలనీకి చెందిన మహేందర్ ఇటీవల నాలుగో అంతస్తు భవనం నుంచి పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకుని అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదే సెంటర్ లో విద్యార్థులు తమ పాఠశాలకు ఆట స్థలం కావాలని కోరారు.

# టీటీడీ చైర్మన్‌గా రేపు బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం

తిరుపతి, నవంబర్ 5: టీటీడీ పాలక మండలి చైర్మన్‌గా బీఆర్ నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కూటమి ప్రభుత్వం టీటీడీ బోర్డు సభ్యుల జాబితాను వారం రోజుల క్రితం ప్రకటించింది. చైర్మన్‌తో సహా మొత్తం 25 మంది సభ్యులతో పాటు మరో నలుగురు అధికారులను ఎక్స్అఫిషియో సభ్యులుగా నియమించిన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. చైర్మన్‌గా రాక సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం స్వామివారి దర్శనం అనంతరం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. టీటీడీ పాలక మండలిలో ఏపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు.

తెలంగాణలో వివిధ రంగాలకు చెందిన ఐదుగురికి, కర్ణాటకకు చెందిన ముగ్గురిని, తమిళనాడుకు చెందిన ఇద్దరిని నియమించారు. గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఒక్కొక్కరికి చోటు కల్పించారు. జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటేశ్వరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, కృష్ణమూర్తి, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి, సాంబశివరావు, నన్నపనేని సదాశివరావు, జంగా కృష్ణమూర్తి, ఆర్ఎన్ దర్శన్, జస్టిస్ హెచ్ఎల్ దత్, శాంతరామ్, రామ్మూర్తి, తమ్మిశెట్టి జానకీదేవి, బి.మహేందర్ రెడ్డి, అనుగోలు రంగశ్రీ, సుచిత్ర ఎల్లా, తదితరును నియమించారు.

# ఆ అధికారులది పెద్ద మనసు..


-మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత
-రూ. నాలుగు లక్షల విరాళం

కరీంనగర్, నవంబర్ 5:2009 బ్యాచ్ పోలీస్ అధికారులు మరోసారి పెద్దమనసు చాటుకున్నారు. 2007 బ్యాచ్ కి చెందిన పోలీస్ అధికారి



ఇటీవల మృతిచెందగా వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు. 2007 ఎస్ఐ బ్యాచ్ కు చెందిన సైరీ రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబానికి మంగళవారం 4లక్షల రూపాయల విరాళం అందజేశారు. 2009 బ్యాచ్ లో ఎస్ఐలుగా ఎంపికైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పోలీస్ అధికారులు గత కొన్నేళ్ల క్రితం వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసుకొని ఆపద సమయంలో పోలీస్ మిత్రులకు చేదోడుగా నిలుస్తున్నారు. శాఖ పరంగా ఇబ్బంది తలెత్తిన సమయం తో పాటు ఆపద సమయంలో అండగా నిలుస్తున్నారు. ఇప్పటికే ఎందరో మిత్రుల కుటుంబాలకు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. తాజాగా మృతుడు రాజేష్ కుటుంబానికి అండగా నిలవడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ప్రదీప్ కుమార్, పర్శ రమేష్, కోటేశ్వర్, లక్ష్మీనారాయణ, స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

# తెలంగాణలో భూముల విలువ ఛూమంతర్ అనగానే పెరగలేదు : కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 5: తెలంగాణలో భూముల విలువ ఛూమంతర్ అనగానే పెరగలేదు.. కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా సమగ్ర, సమీకృత, సమ్మిళిత అభివృద్ధి చేశారు.. అందుకే తెలంగాణలో ఎక్కడ ఏ మూలకు వెళ్లినా ఎకరం రూ. 15 నుంచి 20 లక్షలకు తక్కువ లేదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మార్పు.. మార్పు అని కాంగ్రెస్ ప్రచారం చెప్పింది.. మరి ఈ మార్పు ఎలా ఉంది..టీఆర్ఎఫ్ మాదిరిగానే టీఆర్ఎస్ పెట్టే వరకు కూడా తెలంగాణ శక్తి ఎవరికీ తెలియలేదు అని కేటీఆర్ తెలిపారు. శ్రీనగర్ కాలనీలో తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

భూమి కోసం తెలంగాణలో జరిగిన పోరాటాలు ఇక్కడి బిడ్డలందరికీ తెలుసు. ఎన్నో భూ ఉద్యమాలకు తెలంగాణ కేంద్రంగా ఉంది. ప్రతి ఒక్కరి జీవితం భూమి చుట్టూ తిరుగుతోంది. భూమి విలువ చాలా ఎక్కువగా ఉంటుంది కనుకే దాని కోసం ఎన్నో పంచాయితీలు జరుగుతాయి. టీఆర్ఎస్ పార్టీకి మొదట్లో రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతంలో పట్టు దొరకలేదు. ఎందుకంటే తెలంగాణ ఏర్పడితే భూముల ధరలు తగ్గుతాయని చాలా ప్రచారం చేశారు. తెలంగాణ ఏర్పడితే భూముల విలువ పెరుగుతదంటే ఎవరు నమ్మలేదు. అసలు రాష్ట్రాన్ని నడిపే సమర్థత మీకు ఉందా అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. హిందూ - ముస్లిం పంచాయితీ, నక్సలిజం, భూముల ధరలు పడిపోతాయంటూ ప్రచారాలు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు.

కానీ తెలంగాణ ఏర్పడిన వెంటనే కేసీఆర్ పొట్టకూటి కోసం వచ్చిన వాళ్లతో మాకు పంచాయితీ లేదన్నారు. అభివృద్ధే మా మతం, సంక్షేమమే మా కులం అంటూ కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. గతంలో బంగారం బ్యాంకుల్లో డిపాజిట్ చేసేవారు. కానీ గత 20 ఏళ్లుగా మాత్రం మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వాళ్లు భూమి మీద పెట్టుబడి పెట్టారు. అలాంటిది తెలంగాణ ఏర్పడితే తెలంగాణలో భూముల ధరలు ధమాల్ అంటాయంటూ అనుమానంతో వాళ్లు ఉండేవారు. అందుకే తెలంగాణ ఏర్పాటుకు వాళు భయపడ్డారని కేటీఆర్ తెలిపారు.

అదే విధంగా తెలంగాణలో భూములకు గతంలో నీళ్లు ఉండే పరిస్థితి లేదు. మా తాతకు కూడా వందల ఎకరాలు ఉండేది. కానీ నీళు లేకపోవటంతో దానికి ఎలాంటి విలువ లేకుండా పోయింది. ఎంత పెద్ద భూస్వామి అయినప్పటికీ భూమికి విలువ లేకపోవటంతో బంగారం కుదవ పెట్టాల్సిన పరిస్థితి ఉండేది. కేసీఆర్ ఇవన్నీ దగ్గరుండి గమనించారు. నీళ్లు లేకపోవటంతోనే భూములకు విలువ లేదని గ్రహించారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలన తర్వాత ఇప్పుడు తెలంగాణలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లిన సరే ఎకరానికి రూ. 15 లక్షలు అయ్యింది. భూమి విలువ పెరిగితే భూమి ఉన్న యజమానికి ఎంతో భరోసా ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

రైతు భరోసా వచ్చి, సాగు నీళ్లు వచ్చి, 24 గంటల కరెంట్ వచ్చి ఇవాళ ప్రతి రైతు ఎంతో భరోసాగా ఉన్నాడు. దానికి కారణం కేసీఆరే. మార్పు మార్పు అని కాంగ్రెస్ ప్రచారం చేసింది. మరి ఈ మార్పు ఎలా ఉంది? తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌ను మీరు నాశనం చేస్తారంట కదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. తెలంగాణ రాకముందు వారానికి రెండు రోజులు పవర్ హాలిడేస్ ఉండేవి. రైతులు అర్థరాత్రి వెళ్లి పొలానికి నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ కేసీఆర్ మొత్తం పరిస్థితిని మార్చేశారు. నీళ్లు, కరెంట్ సమస్యను తీర్చేశారు. తెలంగాణలో భూముల విలువ ఛూమంతర్ అనగానే పెరగలేదు. సమగ్ర, సమీకృత అభివృద్ధిని కేసీఆర్ చేశారు. అందుకే తెలంగాణలో ఎక్కడ చూసినా ఒక్క ఎకరం రూ. 15 లక్షలు ఉందని కేటీఆర్ తెలిపారు.

మా ప్రత్యర్థులు మాత్రం డెవలప్‌మెంట్ ఆటో పైలట్ మోడ్‌లో ఉందని అంటారు. మరీ ఈ ఏడాది ఎందుకు డెవలప్‌మెంట్ జరగటం లేదు. మంచిగా చేసిన కరెంట్‌ను కూడా నాశనం చేశారు. ఏ రైతును కదలించినా బాధపడుతున్నారు. మేము కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని చెబుతున్నారు. నల్గొండలో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో వాళ్ల పార్టీ నాయకులే కాంగ్రెస్ చేసిన మోసాలను చెబుతున్నారు అని కేటీఆర్ తెలిపారు.

# భద్రకాళి ఆలయానికి ఈట్ రైట్ ప్లేస్ సర్టిఫికెట్

వరంగల్, నవంబర్ 5 : వరంగల్ భద్రకాళి ఆలయంలో నాణ్యతతో కూడిన ప్రసాదాల తయారీపై భారత ఆహార పరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ 'ఈట్ రైట్ ప్లేస్' సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. ఆలయంలో ప్రసాదాల తయారీ, వంటశాలల పరిశుభ్రతపై ఫుడ్ సేఫ్టీ అధికారులు అనేక సార్లు తనిఖీలు చేసిన అనంతరం ఇచ్చిన నివేదిక ఆధారంగా సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

మంగళవారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ అండ్ వెల్ఫేర్ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆలయ ఈవో శేషుభారతి అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

# తులం బంగారం హామీని ప్రభుత్వం అమలు చేయాలి : ఎమ్మెల్యే తలసాని




హైదరాబాద్, నవంబర్ 5:ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారంఎప్పుడిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలోలబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదింటి ఆడపడుచుల పెండ్లికి ఆర్థిక సహాయం అందించాలని నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ పథకాలతో ఎంతోమంది పేదింటి ఆడబిడ్డల పెండ్లిళు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచేందుకు అలవి కాని హామీలను ఇచ్చింది. తీరా గెలిచాక ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. అర్హులకు ఆర్థిక సహాయం అందించడంలో జాప్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కొడుకు సరిగా చదవడం లేదని ఆత్మహత్య చేసుకున్న తల్లి

హైదరాబాద్, నవంబర్ 5: బాలానగర్‌లో విషాదం చోటు చేసుకుంది. కొడుకు సరిగా చదవడం లేదని తల్లి బలవన్మరణానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే..బాలానగర్‌లోని రాజుకాలనీకి చెందిన గౌడి పుష్పలత(39)కి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఇంటర్ చదివే రెండో కొడుకు కాలేజీకి వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. ఈ విషయంలో తరుచూ భర్తతో పుష్పలత గొడవ పడుతుండేది. కొడుకు చదువు, అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురైన పుష్పలత ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందించిన హోంమంత్రి అనిత

అమరావతి, నవంబర్ 5:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై హోంమంత్రి అనిత స్పందించారు. ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న నేరాల విషయంలో అందరమూ బాధపడుతున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ బయటపడ్డారు.. మేం పడలేదు.. అంతే తేడా అని చెప్పారు. ఆయనతో క్లారిటీగా మాట్లాడానని, సోమవారం పవన్ మాట్లాడిన మాటలను పాజిటివ్ గా తీసుకుంటా నని చెప్పారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ను పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈమేరకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షలో మహిళలపై అఘాయిత్యాలు, గంజా యి వంటి అంశాలపై చర్చించినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. నేరాలను నియంత్రించేందుకు తీసుకో వాల్సిన చర్యలపై సమీక్ష జరిపామ న్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో గ్యాంగ్ రేప్ జరగడం బాధాకరమని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు. గతంలో రాజకీయంగా నేరాలు ప్రోత్సహించడమే ఇప్పుడీ పరిస్థితికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. నేరస్థులకు వెంటనే శిక్షలు విధించి, అమలు చేయడానికి ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబుతో మాట్లాడతానని అనిత చెప్పారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జగన్ కు భావప్రకటన స్వేచ్ఛ ఇప్పుడు గుర్తుకు వచ్చినట్లుంది.. గత ప్రభుత్వ హయాంలోనూ పోలీసులు ఇబ్బంది పడ్డ విషయం మాత్రం గుర్తులేదని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు.

# శాంతి భద్రతల విషయంలో రాజీ పడబోం -స్పష్టం చేసిన హోం మంత్రి అనిత

**-అనంతలో ప్రొబిషన్ డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్**
**-డిజిపితో పాటు పాల్గొన్న హోంమంత్రి**
**-నేరస్థులు అప్ డేట్ అవుతున్నారు..**
**-పోలీస్ లు కూడా వారి కంటే ముందే ఉండాలి**
**-విధులలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ ఉండాలి**

అనంతపురం, నవంబర్ 5: శాంతి భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత.. అనంతపురంలో ప్రొబిషన్ డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్ లో హోం మంత్రి అనితతో పాటు డీజీపీ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు.. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న డీఎస్పీల నుంచి గౌరవ వందనం స్వీకరించారు హోం మంత్రి.. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డీఎస్పీలకు పథకాలను ఈ సందర్భంగా అందించారు హోం.

అనంతరం అనిత మాట్లాడుతూ.. మహిళలు, చిన్న పిల్లలపై ఆఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. .. ఇవాళ నేరస్థులు కూడా పోలీసులకు దొరక్కుండా అప్ డేట్ అవుతున్నారని చెప్పారు.. .. ఈ రోజు మనం అప్పొను కూడా నిర్మించుకోలేని పరిస్థితి ఉందన్నారు.. అయితే, లా అండ్ ఆర్డర్ ను పటిష్ఠం చేయాలని అంటూ మన ముందు చాలా టాస్క్ లు ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ శాంతి భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు..

ప్రతి జిల్లాల్లో సోషల్ మీడియా పోలీస్ స్టేషన్ లు..




ప్రతి జిల్లాల్లో సోషల్ మీడియా పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు కోసం ఆలోచిస్తున్నామని చెప్పారు? ఆర్థిక, రాజకీయ, గంజాయి ముసుగులో అనేక ఉన్మాదాలు జరుగుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.. పోలీస్ యూనిఫాం వేసుకున్నందుకు గర్వ పడండి.. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించండి అంటూ ట్రైనింగ్ పూర్తిచేసుకున్న డీఎస్పీలకు సూచించారు హోంశాఖ.

దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ..

ఈ కార్యక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ.. రెండూ ఉండాలి అంటూ డ్రైనింగ్ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు సూచించారు ఏపీ డీజీపీ . త్వరలో అమరావతిలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయబోతున్నాం అన్నారు.. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న డీఎస్పీలు విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

# స్కూల్ విద్యార్థులపై విచక్షణారహితంగా దాడి.. పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు




స్కూల్ విద్యార్థులపై విచక్షణా రహితంగా దాడి.. పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు ఆడుకుంటామని అడిగితే.. వాతలు వచ్చేలే కొట్టి.. ఎవ్వరికైనా చెబితే చంపేస్తామంటూ స్కూల్ యాజమాన్యం బెదిరించింది. సోమవారం పేరెంట్స్ మీటింగ్‌లో వెలుగులోకి వచ్చిన ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఘనపురం గ్రామానికి చెందిన రమేశ్ నాయక్ తన కుమారుడిని శామీర్‌పేటలోని సెయింట్ పాల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివిస్తూ.. హాస్టల్‌లో చేర్పించాడు. అక్టోబర్ నెలలో పేరెంట్స్ మీటింగ్ ఉండటంతో పాఠశాలకు వచ్చిన రమేశ్‌నాయక్.. తన కొడుకు దిగాలుగా ఉండడాన్ని గమనించి.. ఏమైనా ఇబ్బంది ఉన్నదా.. అని అడిగాడు.

ఒక్కసారిగా ఆ బాలుడు బోరుమని విలపిస్తూ స్కూల్ యాజమాన్యం చేసిన ఘాతుకాన్ని వివరించాడు. మీటింగ్‌కు రెండు రోజుల ముందు స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకుంటామని ప్రిన్సిపాల్‌ను అడగడంతో.. ఉపాధ్యాయులు, చైర్మన్ కొడుకు అభిలాష్ కలిసి విచక్షణారహితంగా దాడి చేశారంటూ వివరించి, వీపుపై ఉన్న వాతలను చూపించాడు. తనతో పాటు మరో ఆరుగుర్ని గదిలో బంధించారని చెప్పాడు. విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అక్టోబర్ 31న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఆడుకోవడం నేరమా, ఆడుకుంటామని ప్రిన్సిపాల్‌ను అడగడం ఘోరమా.. అని నిలదీశారు. విద్యార్థులపై దాడి చేసిన ఉపాధ్యాయులు రఫీ, చైర్మన్ కొడుకు అభిలాష్‌తో పాటు స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట గాయాలతో ఉన్న ఫొటోలను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు స్కూల్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు.

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు రవాణా చేపట్టాలి... జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, నవంబర్ 5: నర్సాపూర్ మండలం ఎర్రకుంట తాండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టర్ సందర్శించి కొనుగోళ్ల తీరును రిజిస్టర్ ల ద్వారా పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు రవాణా చేపట్టి తరలించాలన్నారు. దొడ్డు రకం, సన్నరకం ధాన్యం న్ని పరిశీలించారు. తేమ శాతం వస్తేనే కొనుగోలు చేస్తున్నామని నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. సన్న రకం దొడ్డు రకం విక్రయాలను వేరువేరుగా చేపట్టాలని నిర్వాహకులకు చెప్పారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం 500 రూ.లు.బోనస్ ఇస్తున్నట్లు రైతులకు కలెక్టర్ తెలియజేసారు. ట్యాబ్ ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కొనుగోలు కేంద్రాలలో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పరిశీలించారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. కలెక్టరు వెంట నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ రెడ్డి తాసిల్దార్ శ్రీనివాస్ సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఇఫీ ఆధ్వర్యంలో నలుగురు భారతీయ సినీ దిగ్గజాల శతాబ్ది ఉత్సవాలు

న్యూఢిల్లీ, నవంబర్ 5:భారతీయ సినిమాను బహుముఖీనంగా తీర్చిదిద్దిన నలుగురు సినీ దిగ్గజాలకు 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం తగిన రీతిలో గౌరవించనున్నది. సినిమా రంగంలో అసాధారణ సేవలందించిన- రాజ్ కపూర్, తపన్ సిన్హా, అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్), మహమ్మద్ రఫీల గౌరవార్థం.. ఇఫీ ప్రత్యేక కార్యక్రమాల్ని రూపొందించింది. వీటిలో అనేక సినిమా ప్రదర్శనలు, ముఖాముఖి కార్యక్రమాలు, ఇంకా ఇతర కార్యక్రమాల ద్వారా ఈ కళాకారుల గురించి ప్రతినిధులకు పరిచయం చేస్తారు.

కాలదోషం పట్టని అపురూప చిత్రాలను పునరుద్ధరించిన ఎన్ఎఫ్ డీసీ – ఎన్ఎఫ్ఏఐ

అజరామరంగా నిలిచే ప్రముఖుల చిత్రాలను ప్రదర్శించడం ద్వారా ఇఫీ ఆయా కళాకారులకు నివాళి అర్పించనున్నది. ఎన్ఎఫ్ డీసీ – ఎన్ఎఫ్ఏఐ అపురూప చిత్రాలను పునరుద్ధరించాయి. భారత సినీ చరిత్రలో పేరెన్నిక గన్న చలన చిత్రాలను ప్రేక్షకులకు పరిచయం చేయాలని నిర్ణయించారు. పాత చిత్రాలకు కొత్త హంగులు అందించడం ద్వారా వాటిని పునరుద్ధరించి, ప్రేక్షకులకు కనువిందు చేయనున్నారు.

డిజిటల్ గా పునరుద్ధరించిన రాజ్ కపూర్ చిత్రం ఆవారాను ప్రదర్శించనున్నారు. సగటు మనిషి జీవితంలోని ఆత్మీయతానురాగాలు, హాస్యం, సహానుభూతులను కళ్లకు కట్టినట్లు రాజ్ కపూర్ ఆ సినిమాలో చూపించారు. పునరుద్ధరించిన సినిమాను ప్రదర్శించడం ద్వారా- రాజ్ కపూర్- భారతీయ సినిమాకు అందించిన అద్వితీయమైన సేవలతోపాటు, సామాజిక అంశాలను నిశితంగా, ఆర్ద్రంగా చిత్రించిన వైనాన్ని కళ్లకు కట్టనున్నారు.

తపన్ సిన్హా దర్శకత్వం వహించిన హార్మోనియం చిత్రాన్ని ప్రదర్శిస్తారు. దీని ద్వారా తపన్ సిన్హా క్లిష్టమైన కథన శైలి గురించి ప్రేక్షకులు తెలుసుకోవడం వీలవుతుంది. బలమైన ఇతివృత్తానికీ, నిశితమైన కథనానికీ పేరెన్నికగన్న 'హార్మోనియం'... సిన్హా కళాత్మక ధోరణి, సినిమా శైలికీ ఉదాహరణగా నిలిచింది.

సినీ చరిత్రలో అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్) స్థానాన్ని సుస్థిరం చేసిన చలనచిత్రం 'దేవదాసు'ను ఇఫీ ప్రదర్శించనున్నది. దేవదాసు.. ఇఫీ ప్రదర్శనల్లో హైలైట్ కానున్నది. పునరుద్ధరించిన ఈ సినిమాలో... దేవదాసుగా ఏఎన్నార్ పాత్ర మరింత ఆకర్షణీయంగా ఉంది. భారతీయతను నిశితంగా ప్రతిబింబించే పాత్రలో ఆయన భావోద్వేగభరిత ప్రదర్శనతో నేటి తరం ప్రేక్షకులు తాదాత్మ్యం చెందడం ఖాయం.

చివరిగా, హమ్ దోనో చిత్రాన్ని ప్రదర్శిస్తారు. ఆడియో, వీడియోపరంగా ఈ సినిమాకు మెరుగులు దిద్దారు. దిగ్గజ గాయకుడు మహమ్మద్ రఫీ చిరస్థాయిలో నిలిచే పాటలందించారు. సంగీతం, సినిమా రంగాలకు రఫీ అందించిన అసాధారణ సేవలకు తార్కాణంగా ఈ ప్రదర్శన నిలుస్తుంది. అన్ని తరాల వారినీ మంత్రముగ్ధులను చేసే ఆయన స్వరం వీనుల విందు కానున్నది.

చిత్రాలను ప్రదర్శించడంతోపాటు, ఈ నలుగురు సినీ ధృవతారల కృషిని ఈ చిత్రోత్సవమంతా ఇఫీ స్మరించుకుంటుంది. వారి జీవిత విశేషాలను వివరిస్తూ, వారి విజయాలను శ్లాఘిస్తూ ప్రారంభోత్సవంలో ఒక అద్భుతమైన ప్రదర్శనను రూపొందించారు. వారి సినీ ప్రస్థానాన్ని కళ్లకు కట్టేవిధంగా ఆడియో విజువల్ ప్రదర్శన కూడా నిర్వహించనున్నారు.

చర్చలు, సదస్సులు: గౌరవ అతిథులు, కుటుంబ సభ్యులతో చర్చలు, మౌఖిక సదస్సులు ఉంటాయి. వాటి ద్వారా వారి జీవిత విశేషాలను ప్రేక్షకులకు అందిస్తారు. చలనచిత్ర పరిశ్రమపై వారి కృషికి సంబంధించి వ్యక్తిగత, వృత్తిపరమైన అంశాలను ఎన్నింటినో ఆహూతులకు అందిస్తారు.

మై స్టాంప్ ఆవిష్కరణ: భారతీయ సంస్కృతి, సినిమాపై చెరగని ముద్రకు ప్రతీకగా, ఈ సినీ దిగ్గజాలకు గౌరవ సూచకంగా ప్రత్యేకమైన స్టాంపును ఇఫీ ఆవిష్కరించనుంది.

రెండు భాషల్లో కరపత్రాలు: నలుగురి విజయాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ... ప్రత్యేకంగా రెండు భాషల్లో విడుదల చేసే కరపత్రాలు ప్రతినిధులను ఆకట్టుకోనున్నాయి.

పాటల ప్రస్థానం: రాజ్ కపూర్ – మహ్మద్ రఫీ 150 పాటలతోపాటు తపన్ సిన్హా–ఏఎన్నార్ 75 పాటల సంగీత ప్రస్థానంపై రూపొందించిన కార్యక్రమం ఈ దిగ్గజాలు సంగీతపరంగా చేసిన కృషిని ప్రేక్షకుల ముందుంచుతుంది. భారతీయ సినీ సంగీతంపై వారు వేసిన చెరగని ముద్రను ప్రతిబింబిస్తుంది.

ప్రదర్శన: రాజ్ కపూర్, తపన్ సిన్హా, ఏఎన్నార్, మహ్మద్ రఫీ జీవిత విశేషాల అరుదైన జ్ఞాపకాలు, చిత్రాలు, కళాఖండాలతో నిర్వహించే ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ కానున్నది.

ప్రత్యేక కార్యక్రమాలు: ఈ ఉత్సవం సందర్భంగా ఒక్కో సినీ దిగ్గజానికి... ఒక్కో రోజు చొప్పున ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. ప్రేక్షకులను నిమగ్నం చేసే కార్యక్రమాలు, డిజిటల్ ప్రదర్శనలు, క్విజ్ నిర్వహణ వంటివి అందులో ఉన్నాయి. ప్రేక్షకులకు ఈ దిగ్గజాల విశేషాలను తెలియజెప్పడంతోపాటు, శాశ్వతమైన వారి ఘనతను చాటడానికి ఇవి ఉపయోగపడతాయి.

సైకత కళా ప్రదర్శన: దిగ్గజ కళాకారులకు నివాళిగా ఈ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కళా అకాడమీలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ సైకత కళాకారుడు శ్రీ సుదర్శన్ పట్నాయక్ సైకత కళా ప్రదర్శన ఉంటుంది.

కళ, చరిత్ర, భాగస్వామ్య అనుభవాలను ఒకే వేదికపై నుంచి అందించడం ద్వారా వారి ఘనతలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వాలని, దాంతోపాటు సినీ ప్రపంచంపై రాజ్ కపూర్, తపన్ సిన్హా, అక్కినేని నాగేశ్వరరావు, మహ్మద్ రఫీ ప్రభావాన్ని చిరస్థాయిలో నిలపాలని ఇఫీ భావిస్తోంది.

ఇఫీ అంటే సినిమాల ప్రదర్శన, సినీ ప్రేమికుల సంగమం మాత్రమే కాదు! స్థూలంగా.. నిపుణులైన అనేకానేక మంది కళాకారుల సినీ అనుభవాలను పంచుకోవడం ఈ ఉత్సవ ఉద్దేశం. సినీ వినీలాకాశంలో... ఒక వెలుగు వెలిగిన ధృవతారల విశేషాలు భావితరాలకు కూడా ఎప్పటికీ స్ఫూర్తిదాయకం

# బోనస్ దేవుడెరుగు.. అసలు ధాన్యమే కొనడం లేదు : మాజీ మంత్రి ఎర్రబెల్లి



జనగామ నవంబర్ 5: సన్నధాన్యానికి రూ.500 బోనస్ దేవుడెరుగు, కనీసం ధాన్యం కొనుగోళు ప్రారంభించినా చాలు .. ఇదే పదివేలని రైతులు అనుకుంటున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించగా, రైతులు తమ గోడును వినిపించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఎంతో ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రెండు వారాలు గడుస్తున్నా నేటికి కొనుగోళ్లు జరగడం లేదని విమర్శించారు. రైతులు ఇప్పటికే రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలుపై నమ్మకాన్ని కోల్పోయారని, సన్నధాన్యంపై బోనస్ ఇస్తారనే నమ్మకం రైతులకు లేదన్నారు.

రైతులు ఇప్పటికే తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి వారం రోజులు దాటుతు న్నదని, కళ్లాల్లోనే వానలకు తడిచి, కావలికాయలేక ఆగమాగం అవుతున్నారన్నారు. గత 10 ఏళ్లుగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వాడుకుని లబ్ధి పొందిన రైతులు నేడు ఇదెక్కడి ప్రభుత్వమని తలలు పట్టుకుంటున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. సన్న వడ్లకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా అమలయ్యే వరకు రైతుల పక్షాన నిలబడి కొట్లాడుతామని ఆయన హెచ్చరించారు.

